ఎల్బీనగర్
నమస్తే తెలంగాణ బుధవారం 10 జనవరి 2024
WEDNESDAY, JANUARY 10, 2024

### కవితా పోటీలు

సైదాబాద్, జనవరి 9 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వైఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర దేవస్థానం ఆవరణలో కూచిపూడి నృత్యం, సంక్రాంతి సరదాలు అనే అంశంపై కవితా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా రూపాల్లో తెలుగు జాతి కళాకారులు విశేష ప్రతిభ వంతులని, కళా ప్రదర్శనల్లో అద్భుతమైన ప్రతిభను చాటుతారన్నారు. సంక్రాంతి కవితా పోటీల్లో వర్తమాన కవులు తమ కవితలను పఠనం చేయగా, సౌందర్య, అరుణ, ప్రజ్ఞ, అర్చన, ఉషారాణి, సంతోషి, ప్రవళిక చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. నృత్య కళాకారిణి డాక్టర్ ప్రవీణ, టీవీ శిరీష నాయ్యనిర్ణేతలుగా వ్యవహరించగా, అతిథులు విజేతలకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గాయని కావేశ్వరి, ఆలయ కమిటీ ప్రతినిధులు నేరేళ్ల ప్రసాదరావు, సాయిరాం పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- దివ్యాంగుల భవనం ప్రారంభం



నాదర్‌గూల్‌లో దివ్యాంగుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, జనవరి 9: దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగి ఉన్నత స్థానాలకు చేరాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్ నాదర్‌గూల్‌లో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన దివ్యాంగుల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల భవనాన్ని ఒక గొప్ప ఉద్దేశంతో నిర్మించినట్లు తెలిపారు. ఇందులో వినూత్న ఆలోచనలు, ఉపాధి గురించి చర్చించుకోవాలని పేర్కొన్నారు. భవనంలో లక్ష రూపాయలతో ఇస్తరాకులు తయారు చేసే యంత్రాన్ని ఇప్పించినట్లు తద్వారా ఉపాధి పొందాలన్నారు. దివ్యాంగులు ఒక సంఘంగా ఉండి ఉపాధి, వ్యాపారాలపై దృష్టి పెట్టాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ ఉన్నప్పుడు ఎవరూ అడగకున్న రూ.4వేల వరకు పెన్షన్ పెంచాలని, ప్రస్తుత ప్రభుత్వం కూడా కూడా ఎన్నికల్లో హామీ మేరకు పెంచిన దివ్యాంగుల పెన్షన్లతో పాటు రూ.44లక్షల మందికి అన్ని రకాల పెన్షన్లు అందించాలని కోరారు. మూడోసారి గెలిపించి సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు ఒక్క దగ్గర చేరి సమావేశాలు పెట్టుకోవడానికి ఈ భవనం ఒక వేదికగా మారుతుందని తెలిపారు.



చిత్రలేఅవుట్ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ఆర్కేపురం, జనవరి 9 : ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాలనీ అధ్యక్షుడు, ఆర్కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిర, సద్గుణ, వాణశ్రీ, సబితారెడ్డి, శ్రీలత, రాజేశ్వరి, అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తిరుపతిరావు, కృష్ణారెడ్డి, అంజల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలు సృష్టించి.. మోసాలకు పాల్పడి..

- అందె రాంబాబుపై చర్యలు తీసుకోవాలి
- దివ్యాంగుల సంఘాల ఐక్యవేదిక డిమాండ్

హయత్‌నగర్, జనవరి 9 : దివ్యాంగుల సంఘం నాయకుడిని అని చెప్పుకుని తప్పుడు పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్న అందె రాంబాబుపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు దివ్యాంగుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వికలాంగులు హయత్‌నగర్ మండల తహసీల్దార్ సునీత, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్‌నగర్ మండల పరిధిలోని వీరన్నగుట్ట, శ్రీషిర్డీసాయి నగర్ కాలనీలో ప్లాట్ నెం.152 పట్టాదారుడిని అందె రాంబాబు నకిలీ పత్రాలతో బెదిరించి దాదాపు రూ.3లక్షలు వసూలు చేశాడని పేర్కొన్నారు. ప్లాట్ నెం.213/1 ప్లాట్ నంబర్‌తో కరెంట్ బిల్లును ఫోర్జరీ చేసి గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.59తో దరఖాస్తు చేసుకుని తనపేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. ఘట్‌కేసర్ మండలం, అన్నోజిగూడలో జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం స్కీమ్‌లో కె.ఎల్.మహేంద్రనగర్ వికలాంగుల కాలనీలో దివ్యాంగుల కోటాలో ప్లాట్‌ను లబ్ధి పొంది విక్రయించుకున్నాడని తెలిపారు. 2014లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తోటి దివ్యాంగులను నమ్మించి మోసం చేసి రూ.80 లక్షల వరకు వసూలు చేసి జైలుకు కూడా వెళ్లాడని వివరించారు. దివ్యాంగులకు జీవనోపాధి కల్పిస్తానని భవాని సేవా సంఘం బోగస్ సంస్థ పేరుతో నడుపుతూ చందాలు వసూలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపించి అందె రాంబాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో తెలంగాణ వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు నర్సింహ, తెలంగాణ వికలాంగుల సేవా సంఘం అధ్యక్షుడు పాండు, రవీందర్‌రెడ్డి, కేవీఎస్‌ఎస్ అధ్యక్షుడు చెన్నకేశవులు, దివ్యాంగుల రీసర్చ్ కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, ఉదయ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జంగయ్య, రామచంద్రయ్య, బడుగు బలహీన వర్గాల సేవా సంఘం అధ్యక్షుడు కోమురయ్య నాయక్ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ సునీతకు ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగుల సంఘాల ఐక్యవేదిక నాయకులు

## నేడు మారుతీనగర్‌లో ముగ్గుల పోటీ

ఎల్బీనగర్, జనవరి 9: కొత్తపేట డివిజన్ మారుతీనగర్‌లో బుధవారం సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు కొత్తపేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్ సంక్షేమ సంఘం, కొత్తపేట డివిజన్ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మారుతీనగర్ జైన్ మందిర్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 9 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు, 11కేవీ ఈదీబజార్, 11కేవీ జ్యోతిబాగ్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ రైయిన్‌బజార్, 11కేవీ మూన్ స్టార్, 11కేవీ డైల్యాండ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2. 30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

మాదన్నపేట, జనవరి 9: ఇద్దరు యువకులు బైక్‌ను నిర్లక్ష్యంగా నడుపుతూ మరో ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఐదుగురు గాయపడ్డ సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రక్షాపురానికి చెందిన జావేద్ రక్షాపురం నుంచి తన భార్య ముగ్గురు పిల్లలతో ఫిసల్ బండ వెళుతుండగా వెనుక నుంచి వీరి ద్విచక్రవాహనాన్ని ఇద్దరు యువకులు ఢీ కొట్టడంతో కిందపడ్డారు. స్థానికులు దవాఖానకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. జావేద్ ఫిర్యాదు మేరకు యువకులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మన్సూరాబాద్, జనవరి9: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త డాక్టర్ రామ్మోహన్ అన్నారు. సోమవారం రాత్రి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈ రెడ్డి గార్డెన్‌లో జాన్సన్ గ్రామర్ పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్ సురేశ్, అకాడమిక్ డైరెక్టర్ లక్ష్మి విశ్వనాథన్ అభినందించారు. ముఖ్య అతిథులుగా ఎన్‌జీఆర్‌ఐ ప్రధాన శాస్త్రవేత్తత రామ్మోహన్, డాక్టర్ శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల అడ్మిన్ అపర్ణ, ప్రధానోపాధ్యాయురాలు విద్యావ్యాస్, పాల్గొన్నారు.





## 13 నుంచి మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం

సైదాబాద్, జనవరి 9 : కరణ్‌బాగ్ కాలనీలో కొలువుదీరిన మల్లికార్జున స్వామి దేవాలయం మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో వీఎన్‌వీ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 13నుంచి 15 వరకు మూడు రోజులపాటు నిర్వహించే కల్యాణోత్సవానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి మల్లన్నస్వామిని దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకుంటారని తెలిపారు. శనివారం ఉదయం 5గంటలకు మేలుకొలుపు, అభిషేకం, భిల్వార్చన, సత్యనారాయణ స్వామి వ్రతం, గంగతెప్ప, శ్రీమల్లన్నస్వామి వారి ఊరేగింపు, ఆదివారం స్వామివారి మేలుకొలుపు, కొట్నం అనంతరం శ్రీబలిజ మెడలదేవి, గొల్లకేతమ్మ సమేత మల్లన్నస్వామివారి కల్యాణోత్సవం, అగ్ని గుండాలు, గొలుసు తెంపటం, అన్నదానం, మల్లన్నస్వామి ఊరేగింపు, సోమవారం సాయంత్రం రేణుకా ఎల్లమ్మ, నల్లపోచమ్మ మహంకాళి అమ్మవార్లకు బోనాలు, ఒడిబియ్యం, ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, కొత్త గాజులను అందజేస్తామన్నారు. సంక్రాంతి పండుగ నుంచి ఉగాది పండుగ వరకు ప్రతి ఆదివారం మల్లన్నస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని, కల్యాణోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

- 9 కిలోల గంజాయి స్వాధీనం

ఎల్బీనగర్, జనవరి : ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి నుంచి 9 కిలోల గంజాయిని చైతన్యపురి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రాయినిపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మం నాయుడు , గద్వాల జోగులాంబ జిల్లా రాజోలి గ్రామానికి చెందిన తెలుగు రమేశ్ ఇద్దరు ఇంటర్‌లో క్లాస్‌మేట్స్. వీరిలో రమేశ్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ద్వారకాపురం కాలనీలో ఉంటూ జాబ్ చేస్తున్నాడు. కాగా 6 నెలల క్రితం ఉద్యోగం కోసం బ్రహ్మం నాయుడు దిల్‌సుఖ్‌నగర్ ద్వారకాపురానికి వచ్చి స్నేహితుడైన రమేశ్ గదిలోనే ఉంటున్నాడు. కాగా వీరు గంజాయి సేవించేందుకు అలవాటు పడ్డారు. జల్సాలకు కావల్సినంత డబ్బులు రాకపోవడంతో తామే గంజాయి వ్యాపారం చేయాలని భావించారు. దీంతో ఏపీలోని అరుకులో నారాయణ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుని గత సంవత్సరం నవంబర్ 23న గంజాయి అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో అరకులో నారాయణ వద్ద కిలో గంజాయి రూ. 8 వేలకు కొనుగోలు చేసి నగరంలో కిలో గంజాయిని రూ. 13 వేల నుంచి రూ. 15 వేలకు విక్రయిస్తున్నారు. జనవరి 6 న బ్రహ్మం నాయుడు, రమేశ్‌లు ఇద్దరు ఎల్బీనగర్ నుంచి ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో వైజాగ్‌కు చేరుకుని అక్కడి నుంచి అరుకుకు వెళ్లి నారాయణ వద్ద గంజాయిని కొనుగోలు చేశారు. తిరిగి 7వ తేదీన సాయంత్రం మైత్రి ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయలు దేరి జనవరి 8వ తేదీన ఉదయం చేరుకొని కొనుగోలుదారులను వెతుకుతుండగా చైతన్యపురి పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు ఫోన్‌లు, 9 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకుని రాచకొండ సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో చైతన్యపురి సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ఎస్‌ఐలు రవి, పాండులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



ప్రవచనాలు చేస్తున్న శ్రీమాన్ యన్.సి.వి.నర్సింహాచార్యులు

### వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు

ఆర్కేపురం, జనవరి 9 : శ్రీ హింపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా తిరుపావై ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శ్రీమాన్ యన్.సి.వి.నర్సింహాచార్యులతో తిరుమల తిరుపతి దేవస్థాన ఆళ్వర్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారి సౌజన్యంతో తిరుప్పావై అవతరిక ప్రవచనం నిర్వహించారు.

### వైన్ షాపును ఏర్పాటు చేయొద్దు

సైదాబాద్, జనవరి 9 : గడ్డిఅన్నారం శివగంగా సినిమా థియేటర్ వద్ద ఏర్పాటు చేస్తున్న వైన్ షాపు పనులను నిలిపివేయాలని జిల్లా ఉన్నతాధికారులను సైదాబాద్ శంకేశ్వబజార్ అషూర్ ఖానా ప్రతినిధులు కోరారు. ముస్లిం షియా కమ్యూనిటీకి చెందిన అషూర్ ఖానాకు సమీపంలో వైన్‌షాప్ ఓపెన్ బార్‌ను ఏర్పాటు చేయటం వలన అషూర్ ఖానాకు వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని, అందుకోసం మారో ప్రాంతానికి తరలించాలని కోరుతూ తాము ముఖ్యమంత్రి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని అషూర్ ఖానా అలీ అస్గర్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాకర్ హుస్సేన్ తెలిపారు.

## దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు

ఎల్బీనగర్, జనవరి 9: ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా ప్రజాపాలనలో ప్రజల నుంచి 2,35,278 లక్షల దరఖాస్తులు అందాయి. ప్రజాపాలనలో భాగంగా జనవరి 6వ తేదీ వరకు ప్రజలు తమ దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా కంప్యూటర్లలో దరఖాస్తులను ఎంట్రీ చేసేందుకు 548 మంది ఆపరేటర్లను నియమించింది. మంగళవారం వరకు సుమారుగా 83,563 దరఖాస్తులను ఇప్పటివరకు ఎంట్రీ చేశారు. అయితే ఈ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆయా సర్కిల్ కార్యాలయల్లో అందుబాటులో ఉండి దరఖాస్తు ఫారాలను ఎంట్రీ చేయాల్సి ఉండగా అధికారులు తమ పనిని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి వారితో పనులు చేయించుకుంటున్నారు.

| సర్కిల్ పేరు | దరఖాస్తుల సంఖ్య |
|---|---|
| కాప్రా | 62,743 |
| ఉప్పల్ | 43,271 |
| హయత్‌నగర్ | 48,801 |
| ఎల్బీనగర్ | 40,765 |
| సరూర్‌నగర్ | 39,698 |
| మొత్తం | 2,35,278 |




ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం

## బ్రిడ్జి నిర్మాణ అలైన్‌మెంట్‌ను మార్చండి

సైదాబాద్, జనవరి 9 : చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్‌నగర్ వరకు చేపట్టిన ఎస్‌ఆర్‌డీపీ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం సైదాబాద్‌లో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు సీఈ దేవానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు, బీజేపీ నాయకులు సైదాబాద్‌లో అత్యంత పురాతనమైన హనుమాన్ ఆలయం పైభాగంపై బ్రిడ్జిని ఏర్పాటు చేయటం ద్వారా హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయంపై నుంచి వెళ్లే బ్రిడ్జి నిర్మాణ పనుల అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. తాము బ్రిడ్జి నిర్మాణ పనులపై జీహెచ్‌ఎంసీ నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లటంతోనే అధికారులు క్షేత్రంలో పరిశీలించటం జరుగుతుందని, బ్రిడ్జి నిర్మాణ పనుల ప్లాన్‌ను మార్చకుంటే భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేపడుతామని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, వినయ్‌కిశోర్ యాదవ్, చెవ్వ మహేశ్, ఉగాది మహేశ్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పేర్కొన్నారు.



జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు సీఈ దేవానంద్‌కు బ్రిడ్జి నిర్మాణంపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

### జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన




మహేశ్వరం, జనవరి 9: మహేశ్వరం మండలంలోని టీటీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం జన్య ఫౌండేషన్ నిర్వహించిన జన్య సైంటిఫిక్, రంగోలీ, సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నా రు. జన్య ఫౌండేషన్–బ్రిస్టల్ ఆధ్వర్యంలో సమకూరిన బోధన పరికరాలు, సైన్స్, గణితం అంశాలను విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, జన్య ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలి



ఏటీఎంను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

మహేశ్వరం, జనవరి 9: మహేశ్వరం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైద్రాబాద్ జిల్లా కో– ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఏటీఎంను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సూచించారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో హెచ్‌డీసీసీబీ బ్యాంక్ ఏటీఎంను మహేశ్వరం సహకార బ్యాంక్ చైర్మన్ మంచె పాండుయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రంలో ఏటీఎం ఏర్పాటు చేశామన్నారు. రైతులతో పాటు స్థానిక ప్రజలు ఈ ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, సత్యనారాయణ, నర్సింహ మేనేజర్ శ్వేత, అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, సీవో షఫీ, దిద్దెల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

General Public are hereby informed that my client **MAMILLAPALLI OMKAR,** Son of **MAMILLAPALLI BRAHMAIAH,** aged about 44 years, Occupation : Business, Residing at Plot No.534, Prashanth Nagar, Vanasthalipuram, Hayathnagar Mandal, Ranga Reddy District, 500079, is intending to purchase All that the Piece and Parcel of the Open land bearing Plot No.**185,** in Block 'B', admeasuring **289** Square yards or its equivalent to 241.6 square meters, in forming Part of Survey No.**69** and **70,** situated at Abhyudaya Nagar, Saheb Nagar Khurd Village, Hayathnagar Mandal, Ranga Reddy District and bounded by North : Plot No.184, South : Plot No.186, East : Plot No.174, West : 33'-0" Wide Road from K. Sarada, Wife of Siva Rama Prasad, for a valuable sale consideration and the seller is agreed to sell the above-mentioned schedule property. to my client and executed the Agreement of sale

Any Person(s) having any right, title and interest in the schedule property and having any sort of objections shall contact the undersigned with all the relevant original documents of the objections, right, title and interest in the schedule property within **15** days of publication of this notice, else my client will proceed further and complete the sale transaction. No further objections will be entertained.

**KOTLA SUDHAKAR**
Advocate & Legal Advisor
H.No.7-3-23, Mallikarjuna Nagar, Bairamalguda Village, Saroornagar, Hydeabad-500079.
Mobile No.0-9390626508, Dated: 24-12-2023